సాక్షి
పల్నాడు

బుధవారం । 7 । మే । 2025



శిక్షణ తరగతులు పరిశీలన

చుండూరు(వేమూరు): వలివేరు గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులను ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి సుబ్బ రత్నమ్మ మంగళవారం పరిశీలించారు.



వైభవంగా బ్రహ్మోత్సవాలు

పొన్నూరు: సుందరవల్లీ సమేత సాక్షి భావన్నారాయణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం పంచామృత స్నపన నిర్వహించారు.

దుర్గగుడి ఈఓగా శీనానాయక్



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన ఈఓగా శీనా నాయక్‌ను నియమిస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేసింది. ఆయన బుధవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉందని ఆలయ వర్గాలు పేర్కొన్నాయి.

ఉపాధికి కోత

జిల్లాలో భారీగా తగ్గిన జాతీయ ఉపాధి హామీ పని దినాలు

- గత ఆర్థిక సంవత్సరంతో పోల్చితే 12.70 లక్షల పని దినాలు తగ్గుదల
- పెద్దఎత్తున ఉపాధి కోల్పోనున్న కూలీలు
- సుమారు రూ.40 కోట్లు వేతనాల రూపంలో నష్టం
- గత ఐదేళ్ల కాలంలో ఇదే కనిష్టం
- ఫలితంగా పెరగనున్న కూలీల వలసలు
- అధికారపార్టీ సానుభూతిపరులకే పనులు కల్పిస్తున్న వైనం



ముప్పాళ్ల మండలంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కార్మికులు (ఫైల్)

సాక్షి, నరసరావుపేట: రైతులు పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధరలు లభించక సాగుకు వెనుకాడుతున్న సమయంలో జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలకు అండగా నిలుస్తుందని అందరూ భావించారు. అయితే గతంలో ఎన్నడూలేని విధంగా ఈ ఆర్థిక సంవత్సరంలో అతి తక్కువ పని దినాలు నిర్ణయించడం ఆందోళన కలిగిస్తోంది. ఉపాధి లభిస్తే కూలీలు సొంత ఊర్లను వదలి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన దుస్థితి రాదు. గత ఐదేళ్ల కాలంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది తక్కువ పనిదినాలు నిర్ణయించడంతో కూలీలు వలసబాట పట్టాల్సిన దుస్థితి రానుందనే అభిప్రాయం వినిపిస్తోంది. ముఖ్యంగా వినుకొండ, మాచర్ల, గురజాల నియోజకవర్గాలలో ఈ ప్రభావం ఎక్కువగా ఉండనుంది. దీంతో ఈ ఏడాది మళ్లీ హైదరాబాద్, విజయవాడ లాంటి నగరాలకు పెద్ద ఎత్తున ఈ ప్రాంతాల నుంచి వలస వెళ్లే ప్రమాదముంది. మరోవైపు ఉన్న పనిదినాలను సైతం కొన్ని చోట్ల పక్షపాతంతో అధికారపార్టీ సానుభూతిపరులకే కల్పిస్తుండటంతో చాలా మంది ఉపాధి కోల్పోతున్నారు. దీనిపై ఉపాధి హామీ కూలీలు, వ్యవసాయ కార్మిక సంఘాలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నాయి.



తగ్గిన 12.70 లక్షల పని దినాలు

వర్షాభావ ప్రాంతమైన పల్నాడు జిల్లాలో జాతీయ ఉపాధి హామీ పథకం వల్ల గత కొన్నేళ్లుగా ఎన్నో కుటుంబాలకు పని లభించి నాలుగువేళ్లు నోట్లోకి వెళ్లాయి. అంతటి ప్రాముఖ్యత కలిగిన ఉపాధి హామీ పథకం పనిదినాల సంఖ్య ఈ ఆర్థిక సంవత్సరంలో భారీగా తగ్గిపోయాయి. 2024–25 ఆర్థిక సంవత్సరంలో పల్నాడు జిల్లాకు 87,48,695 పనిదినాలుగా ప్రకటించగా, ప్రస్తుతం ఆర్థిక సంవత్సరంలో ఈ సంఖ్య కేవలం 74,77,946గా నమోదైంది. ఏకంగా 12,70,749 పనిదినాలు కోత పడింది. దీనివల్ల కార్మికులు పెద్దఎత్తున ఉపాధి కోల్పోయే ప్రమాదముంది. సుమారు రూ.40 కోట్లు వేతనాల రూపంలో కార్మికులు నష్టపోనున్నారు. జిల్లాలో సుమారు 5.9 లక్షల జాబ్‌కార్డులు ఉండగా అందులో 4.3 లక్షల కార్డులు యాక్టివ్‌గా ఉన్నాయి. ఉపాధిహామీ పథకం ద్వారా ఒక్కో కార్మికునికి రోజుకు రూ.307గా కేంద్రప్రభుత్వం నిర్ణయించింది. అయితే ప్రస్తుతం జిల్లాలో కార్మికులకు సగటు వేతనం సుమారు రూ.280 వరకు పడుతోందని లబ్ధిదారులు చెబుతున్నారు.

ఆర్థిక సంవత్సరం	పని దినాలు
2022-23	94,05,074
2023-24	84,76,071
2024-25	87,48,695
2025-26	74,77,946

పని కల్పనలో 'పచ్చ'పాతం

జాతీయ ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు కలిగి ఉండి పనిచేసేందుకు ముందుకు వచ్చిన ప్రతి కుటుంబానికి ఉపాధి కల్పించడం ప్రభుత్వ లక్ష్యం. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో రాజకీయ రంగుపులిమి ప్రతిపక్షపార్టీల సానుభూతిపరులకు ఉపాధి పనులు చూపడం లేదు. అధికారం మారగానే గత ప్రభుత్వంలో పనిచేసిన ఉపాధి హామీ మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లను మార్చి కూటమి పార్టీల కార్యకర్తలకు అప్పచెప్పారు. వారు కేవలం స్థానిక అధికారపార్టీ నేతలు చెప్పిన వారికే పనులు చూపుతున్నారు.

జీవనంపై తీవ్ర ప్రభావం



ఉపాధి హామీ పని అడిగిన అందరికీ పని కల్పించాలి. పనిదినాల సంఖ్య తగ్గింపు వల్ల జిల్లా కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. ఉపాధి హామీ పథకం ఎవరి సొంతం కాదు. ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించుకున్న పథకం. రాజకీయాలకు అతీతంగా గ్రామాల్లో పనులు జరిపించాలి. ప్రతి కుటుంబానికి వంద రోజులు పని దినాలు కల్పించాలి, వారం వారం వేతనాలు అందివ్వాల్సిందే. రాజకీయ కోణంలో పని కల్పించకపోతే ఐక్యంగా కలిసి పోరాడుతాం. కామన్ వర్క్ ఐడీలు కాకుండా ఏ పనికి ఆ పనికి సంబంధించిన ఐడీలు ఇవ్వాలి. దీనివల్ల పని చేసిన వారు, చేయని వారు సమానమై వేతనం తగ్గిపోయే ప్రమాదం ఉంది.

– గంజిమాల రవిబాబు, వ్యవసాయ కార్మి సంఘం పల్నాడు జిల్లా నాయకుడు

పని కల్పించడం లేదు



నాకు జాబ్‌కార్డు ఉంది. గతంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేశాను. ఇప్పుడు కనీసం పని కూడా ఇవ్వటం లేదు. నేను, నా భార్య పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నా ఉపాధి కల్పించడం లేదు. గతంలో పార్టీలకు అతీతంగా పనిదినాల కల్పన, హౌసింగ్ బిల్లుల చెల్లింపులు జరిగేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. పక్షపాతం లేకుండా అందరికీ ఉపాధి కల్పించాలి.

– గంజి శ్రీనివాసరావు, దమ్మాలపాడు, ముప్పాళ్ల మండలం

నాలుగు లైన్ల రహదారితో ఎంతో మేలు

బాపట్ల ఎంపీ టి.కృష్ణప్రసాద్



గుంటూరు వెస్ట్: అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు నుంచి నిజాంపట్నం పోర్టు వరకు నూతనంగా నిర్మించనున్న నాలుగు లైనుల (గ్రీన్ ఫీల్డ్) రోడ్డు నిర్మాణంతో ఎందరికో మేలు జరుగుతోందని బాపట్ల ఎంపీ టి.కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ శంకరన్ హాలులో స్టేక్ హోల్డర్స్‌తో నిర్వహించిన సమావేశంలో ఎంపీతోపాటు, గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, బాపట్ల జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి, జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, బాపట్ల ఎమ్మెల్యే వి.నరేంద్రవర్మ, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా పాల్గొన్నారు. ఎంపీ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ అమరావతి రింగ్‌రోడ్డు నుంచి నిజాంపట్నం పోర్టు వరకు 47.848 కిలోమీటర్లు నాలుగు లైనుల రోడ్డు నిర్మాణం వల్ల ఎన్నో ఆర్థిక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి రోడ్డు నిర్మాణానికి అనుమతులు తీసుకొచ్చామన్నారు. ఆరు మాసాల్లో నిర్మాణ పనులకు అనుమతులు పొందిన తరువాత మరో 18 నెలల్లో రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, బాపట్ల జిల్లా కలెక్టర్ మురళిలు మాట్లాడుతూ ఆర్ అండ్ బీ, విద్యుత్ శాఖ, ఇరిగేషన్, ఫిషరీస్, వ్యవసాయం, పంచాయతీరాజ్, దేవాదాయ శాఖ, అటవీ శాఖ అధికారులు వారి వారి శాఖలకు సంబంధించి ఏవైనా అంశాలు ఉంటే పూర్తి వివరాలతో శుక్రవారం సాయంత్రంలోపు అందించాలని పేర్కొన్నారు. అధికారులు అందించిన వివరాలు క్రోడీకరించి ప్రాజెక్టు రిపోర్టు తయారు చేసి ఢిల్లీలోని నేషనల్ హైవే అథారిటీ వారికి పంపుతామని వివరించారు.

న్యూస్‌రీల్

కోర్టును సందర్శించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి



పొన్నూరు: జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ్ చక్రవర్తి మంగళవారం పట్టణంలోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టును సందర్శించారు. నూతనంగా నిర్మాణం చేపట్టాల్సిన కోర్టు భవనాలకు సంబంధించిన విషయాలను తెలుసుకున్నారు. ఆయనకు కోర్టు న్యాయమూర్తి ఏకా పవన్ కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ బాజీ సాహెబ్, సభ్యులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు పొందుగుల జయరాజు, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ తూమాటి రమేష్, ఏజీపీ ఎస్.శ్రీనివాస్, న్యాయవాదులు, గుమస్తాలు, సిబ్బంది పాల్గొన్నారు.

జెడ్పీ బడ్జెట్‌ను ఆమోదించిన ప్రభుత్వం

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ 2025–26 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ప్రభుత్వం ఆమోదించింది. ఈమేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ మంగళవారం ఉత్తర్వులు విడుదల చేశారు. గత మార్చి 31 నాటికే ఆమోదం పొందాల్సిన బడ్జెట్‌ను ఆమోదించలేకపోవడంతో పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 199 సబ్ రూల్ 3 కింద బడ్జెట్ ఆమోదం కోసం జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు గత నెలలో ప్రభుత్వానికి పంపారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి రూ.643 కోట్ల ఆదాయంతో రూపొందించిన అంచనా బడ్జెట్‌ను ఆమోదించారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా కె.శ్రీనివాస్



నెహ్రూనగర్: గుంటూరు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా కె.శ్రీనివాస్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. రెవెన్యూ సర్వీసెస్ నుంచి డెప్యూటీ కలెక్టర్ స్థాయిలో పనిచేస్తున్న ఆయన్ను గుంటూరు ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా బదిలీ చేశారు. గతంలో ఈడీగా పనిచేసిన పి.ప్రేమ కుమారి ఉద్యోగ విరమణ చేయడంతో ఇన్‌చార్జి ఈడీగా దుర్గాబాయి బాధ్యతలు నిర్వహించారు. నూతన ఈడీగా శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు.

జిల్లాలో ఏఎస్‌ఐలు, హెచ్‌సీలు, కానిస్టేబుళ్ల బదిలీలు



నగరంపాలెం: జిల్లాలోని పోలీస్‌స్టేషన్‌ల్లో ఐదేళ్లు పూర్తయిన కానిస్టేబుళ్లు నుంచి ఏఎస్‌ఐలకు మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాల్‌లో బదిలీల ప్రక్రియ చేపట్టారు. ఈ ప్రక్రియను జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ పర్యవేక్షించారు. 12 మంది ఏఎస్‌ఐలు, 27 మంది హెడ్ కానిస్టేబుళ్లు, మరో 27 మంది కానిస్టేబుళ్లకు స్థానచలనం చేశారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని అన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు సేవలందించేందుకు అందుబాటులో ఉండాలని చెప్పారు.జిల్లా ఏఎస్పీ జీవీ.రమణమూర్తి (పరిపాలన), ఏఓ అద్దంకి వెంకటేశ్వరరావు, జిల్లా ఎస్పీ సీసీ ఆదిశేషు, జూనియర్ సహాయకులు పాల్గొన్నారు.

రైల్వే అధికారులకు ఆహ్వానం లేదు

లక్ష్మీపురం: శంకర్ విలాస్ ఫ్లైఓవర్ శంకుస్థాపనకు గుంటూరు రైల్వే డివిజన్ అధికారులకు ఎలాంటి ఆహ్వానం లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా బుధవారం శంకుస్థాపన చేసేందుకు ముహూర్తం నిర్ణయించారు. అయితే అనివార్య కారణాల వల్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాకపోవడంతో బుధవారం ఉదయం 9 గంటలకు కేంద్ర సహాయక మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ శంకుస్థాపన చేయనున్నారు. శంకుస్థాపనకు సంబంధించి ఎటువంటి సమాచారం లేకపోవడంతో గుంటూరు డీఆర్‌ఎం బుధవారం ఉదయం రేపల్లె రైల్వేస్టేషన్ తనిఖీలకు వెళ్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

పేదల బియ్యం పక్కదారి

- జిల్లాలో యథేచ్ఛగా సాగుతున్న దందా
- పలుచోట్ల అడ్డగోలుగా ఇసుక తరలింపు



చీరాల: పేద, మధ్య తరగతి వర్గాలకు ప్రభుత్వం అందించే రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. అర్హులకు అందాల్సిన బియ్యాన్ని అక్రమార్కులు ఆదాయ వనరుగా మార్చుకున్నారు. అధికారులు అక్కడక్కడా పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నా ఈ దందాను నిలువరించలేకపోతున్నారు. ఈ క్రమంలో పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారుతున్నాయి. జిల్లాతోపాటు పక్కనే ఉన్న పల్నాడు, గుంటూరు జిల్లాల నుంచి కూడా అక్రమ వ్యాపారం చేసే వారు క్యూ కడుతున్నారు. దందా నిర్వహించే వారికి స్థానిక ప్రజాప్రతినిధులు కూడా తెరవెనుక అభయ హస్తం అందిస్తున్నట్లు సమాచారం.

నెలలో పది రోజులే వ్యాపారం...

ప్రభుత్వం పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలకు అందిస్తున్న రేషన్ బియ్యాన్ని ప్రతి నెల ఒకటోతేదీ నుంచి పంపిణీ చేస్తున్నారు. కొంత మంది డీలర్లతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. ఎక్కువ మంది డబ్బులకు విక్రయిస్తున్నారు. కార్డుదారుల నుంచి కేజీ రూ.10 చొప్పున, డీలర్ల నుంచి రూ.15కు తీసుకుంటున్నారు. తర్వాత మిల్లులకు తరలించి పాలిష్ పట్టాక దూర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. ప్రజాప్రతినిధుల అనుచరులు కూడా అక్రమార్కులతో కుమ్మక్కు అవుతున్నారు.

విలేకర్లు 'విజిలెన్స్' అవతారం..

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని రెవెన్యూ, పోలీసులు, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీ చేసి, సీజ్ చేస్తుంటారు. తాజాగా విలేకర్లు ఈ విజిలెన్స్ అధికారుల అవతారమెత్తారు. ఇటీవల పర్చూరు నుంచి చీరాలకు లారీలో రేషన్ బియ్యాన్ని రాత్రి వేళ తరలిస్తున్నారనే సమాచారం రావడంతో ఐదుగురు విలేకర్లు కారులో వెంబడించారు. లారీని ఆపి డబ్బులు డిమాండ్ చేశారు. రెవెన్యూ, పోలీస్ అధికారులకు చెబుతామని దండుకున్నారు. ఈ ఉదంతం ప్రస్తుతం చర్చనీయాంశమైంది. అక్రమార్కులు కూడా ఎందుకొచ్చిన గొడవ అన్నట్లు కొంత ముట్టజెప్పారు. ఈ వ్యవహారం పత్రికలకు ఎక్కింది. గతంలో స్వర్ణలోని ఓ ప్రజాప్రతినిధికి చెందిన రైస్ మిల్లులో రేషన్ బియ్యం ఉన్నట్లు మీడియాలో రాగా డబ్బులు డిమాండ్ చేశారు. ఆయన కారంచేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో గుంటూరుకు చెందిన విలేకరులపై కేసు నమోదు చేశారు. కొందరు విలేకర్లు హైవేలపై కూడా ట్రాన్స్‌పోర్టు లారీలను ఆపి డబ్బులు దండుకుంటున్నారు.

అవే అక్రమార్కులకు సిరులు...

రేషన్ బియ్యం తరలింపుతోపాటు జిల్లాలో ఇసుక అక్రమ రవాణా కూడా జోరుగా సాగుతోంది. ఈ రెండూ అక్రమార్కులకు రెండు కళ్లు. సిరులు కురిపించే అక్రమ వ్యాపారాలు చేయడానికి పెద్ద ఎత్తున పోటీ పడుతున్నారు. అధికార పార్టీలో ప్రజాప్రతినిధులకు చెందిన రెండు వర్గాలు ఇసుక రవాణా చేసేందుకు పోటీ పడ్డాయి. గతంలో ఇసుక తవ్వడానికి వినియోగించిన జేసీబీని దహనం చేయడం వంటి సంఘటనలు జరిగాయి. జిల్లాలో చీరాల, రేపల్లె, వేమూరు, బాపట్ల నియోజకవర్గాల పరిధిలోని ఇసుకను లారీల ద్వారా దూర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రాత్రి వేళల్లో ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఇసుకాసురుల ధన దాహానికి తీర ప్రాంతాలు కుంచించుకుపోతున్నాయి. వందల అడుగుల లోతున జేసీబీలతో ఇసుకను తవ్వుతూ పర్యావరణానికి పెనుముప్పు కలిగిస్తున్నారు. అధికారులు నామమాత్రపు తనిఖీలు చేసి కేసులతో సరిపెడుతున్నారు.

'ఎన్‌ఎస్పీ' వాసులపై పోలీసుల దౌర్జనం

- వెంటనే క్వార్టర్లు ఖాళీ చేయాలంటూ హుకుం
- నిరసనగా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో రోడ్డుపై ఆందోళన చేపట్టిన కాలనీవాసులు
- పునరావాసం చూపేవరకు ఖాళీచేసే ప్రసక్తి లేదంటున్న కాలనీవాసులు



కలెక్టరేట్‌కు వస్తున్న కాలనీవాసులను అడ్డుకుంటున్న పోలీసులు

నరసరావుపేట: తమకు శాశ్వత నివాసాలు ఏర్పాటుచేసి పునరావాసం కల్పించేంతవరకు కాలనీని వదిలి వెళ్లబోమని కాలనీ స్థానిక ఎన్‌ఎస్‌పీ వాసులు, ప్రజాసంఘాల నాయకులు అధికారులకు తేల్చిచెప్పారు. తమపై పోలీసుల దౌర్జన్యాలను నిరసిస్తూ మంగళవారం కాలనీవాసులు పిల్లాపాపలతో కలిసి కలెక్టర్ కార్యాలయం ఆవరణలో రోడ్డుపై బైఠాయించారు. ప్రభుత్వానికి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ డిమాండ్లతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించారు. కలెక్టర్ కార్యాలయానికి వెళ్లేందుకు యత్నించిన వారిని పోలీసులు అడ్డుకున్నారు. వారికి సీపీఐ, సీపీఎం, రైతు సంఘం, పలు ప్రజాసంఘాల నాయకులు మద్దతు పలికారు. కాలనీ వాసుల నాయకుడు, మాలమహానాడు జిల్లా కార్యదర్శి బోరుగడ్డ అంబేద్కర్ విలేకరులతో మాట్లాడారు. తమ కాలనీలోని 35 ఎకరాల భూమిలో ఉద్యోగుల కార్యాలయాలు, ఉద్యోగులకు క్వార్టర్స్ నిర్మాణం చేశారని, 60 ఏళ్లుగా సుమారు 300 కుటుంబాలు నివాసం ఉండేవారన్నారు. శిథిలావస్థలో ఉన్న క్వార్టర్స్‌లో ప్రస్తుతం 62 విశ్రాంత ఉద్యోగులు, పెన్షనర్లకు చెందిన కుటుంబాలు మాత్రమే నివసిస్తూ కాలం వెళ్లదీస్తున్నారన్నారు. నరసరావుపేటను పల్నాడు జిల్లా కేంద్రంగా ప్రకటించగానే అధికారులు కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలు ఏర్పాటుచేసి పాలన కొనసాగిస్తున్నారన్నారు. అప్పటి నుంచి కాలనీవాసులకు కష్టాలు మొదలయ్యాయని, ఆ ప్రాంతాన్ని నిషిద్ధ ప్రదేశంగా మార్చి వేశారని పేర్కొన్నారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్ కోసం స్థలం కేటాయించి కాలనీ ప్రాంగణంలో విశాలమైన రోడ్లు నిర్మాణం చేసిన అధికారులు కాలనీ చుట్టూ ముళ్ల కంచె ఏర్పాటుచేసి ఆ రోడ్లపై కాలనీవాసులు నడవకుండా ఆంక్షలు విధించారన్నారు.

నోటీసులు ఇవ్వకుండానే..

కాలనీ వాసులకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండానే క్వార్టర్స్ ఖాళీ చేసి వెళ్లి పోవాలని పోలీసులు హుకుం జారీ చేస్తున్నారని బోరుగడ్డ తెలిపారు. సోమవారం రాత్రి టూ టౌన్ సీఐ సిబ్బందితో కాలనీలో విద్యుత్ నిలిపి వేయించారని, కాలనీ యువకుల బైకులను బలవంతంగా స్టేషన్‌కు తరలించారన్నారు. తెల్లవారేలోపు క్వార్టర్స్ ఖాళీచేసి వెళ్లిపోవాలని, లేదంటే పొక్లెయిన్లతో కూల్చివేస్తామని హెచ్చరించి వెళ్లారన్నారు. దీనిపై తాము స్థానిక ఎమ్మెల్యేను, జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాలు ఇవ్వాలని నిర్ణయించామని, విషయం తెలుసుకున్న పోలీసులు కాలనీవాసులు కలెక్టరేట్ కాంపౌండ్ దాటకుండా ఆంక్షలు విధించారన్నారు. కాలనీవాసులకు ప్రభుత్వమే నివాస స్థలాలు మంజూరు చేసి వారికి పక్కా ఇళ్లు నిర్మించిన తర్వాతనే వారిని ఖాళీ చేయాలని, అప్పటి వరకు వారు నివశిస్తున్న క్వార్టర్స్‌లోనే ఉండనివ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం నాయకులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కుల నిర్మూలన పోరాట సమితి (కేఎన్‌పీఎస్) రాష్ట్ర కార్యదర్శి కేఎన్ కృష్ణ, సీపీఐ జిల్లా కార్యదర్శి కాసా రాంబాబు, బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీనివాసరావు, రైతుసంఘ జిల్లా నాయకుడు ఏపూరి గోపాలరావు, ఎంహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్, బహుజన హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు గోదా రమేష్‌కుమార్, కేఎన్‌పీఎస్ నాయకుడు జక్కా బ్రహ్మయ్య, పెద్దసంఖ్యలో కాలనీవాసులు పాల్గొన్నారు.

ధగధగ.. వెలవెల

- భారీగా పెరిగిన బంగారం ధర
- కొనుగోలుకు ప్రజలు వెనకడుగు
- కార్పొరేట్ షాపుల రాకతో స్థానిక దుకాణాలవైపు కన్నెత్తి చూడని వినియోగదారులు
- కొనుగోలు లేక వ్యాపారులు విలవిల
- ఉపాధి కోల్పోతున్న కార్మికులు



మంగళగిరిలోని ఓ దుకాణంలో ఆభరణాల తయారీలో నిమగ్నమైన స్వర్ణకారులు

తాడేపల్లి రూరల్: బంగారం ధర పదేళ్లలో నాలుగింతలు అయ్యింది. ఈ ఏడాది 10 గ్రాములు రూ.లక్ష దాటి ఆల్‌టైమ్ రికార్డు సృష్టించింది. ప్రస్తుతం స్వల్పంగా తగ్గుదల ఉన్నా... ఇదీ తాత్కాలికమే అంటున్నారు వ్యాపారులు. రాబో యే కాలంలో పెరగడమే తప్ప తగ్గే అవకాశం ఉండదంటున్నారు. సామాన్యులు కొనలేని స్థాయికి నేడు బంగారం ధర చేరింది. బంగారం ధరలు పెరుగుదల, మరోవైపు కార్పొరేట్ సంస్థల రాక తో స్థానిక వ్యాపారాలు వెలవెలబోతున్నాయి. ఆభరణాల తయారీ కార్మికులు ప్రత్యామ్నాయ ఉపాధి వెతుక్కుంటూ వలసలు వెళ్లిపోతున్నారు.

2వేల మందికి ఉపాధి

మంగళగిరి పట్టణ పరిధిలో బంగారు ఆభరణాలు తయారీతో పాటు విక్రయించే వారు సుమారు 2 వేల మంది వరకు ఉన్నారు. గతంలో పెళ్లిళ్ల సీజన్లలో అందరూ చాలా బిజీగా ఉండేవారు. ప్రస్తుతం బంగారం ధర పెరగడంతో పెళ్లిళ్ల సీజన్ వచ్చినా ఎవరూ తయారు చేయించుకునేందుకు ముందుకు రావడం లేదని, విజయవాడ, గుంటూరు ప్రాంతాల్లో వెలసిన కార్పొరేట్ మాల్స్‌లో కొనుగోలు చేస్తున్నారని తయారీదారులు అంటున్నారు. బంగారం ధర విపరీతంగా పెరగడంతో వినియోగదారులు కొనుగోలు విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. దీంతో స్థానిక జ్యూయల్రీ షాపుల్లో సందడి కనిపించడం లేదు. దీనికి తగ్గట్లు వెండి కూడా దూసుకుపోతోంది.

సందడి లేని పెళ్లిళ్ల సీజన్

ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ నేపథ్యంలో కళకళలాడాల్సిన బంగారం షాపులు వెలవెల బోతున్నాయి. ఓవైపు ధరలు పెరగడం, మరోవైపు కార్పొరేట్ సంస్థల రాక ప్రధాన కారణమని జ్యూయల్రీ షాపుల యజమానులు చెబుతున్నారు. ఈ రంగంలో ఆధునిక సాంకేతిక పరికరాలు రావడం, ధరల పెరుగుదల, కార్పొరేట్ సంస్థలు రెడీమేడ్ వ్యాపారం ప్రారంభించడంతో కార్మికులకు ఉపాధి కొరవడింది. దీంతో సుమారు 40 శాతం మంది ఇతర రంగాలకు తరలినట్లు జ్యూయల్రీ వర్కర్లు చెబుతున్నారు.

10, 11 తేదీల్లో క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో 10వ తేదీన అండర్–23 మెన్ జిల్లా క్రికెట్ పోటీలను, 11వ తేదీని సీనియర్ జట్టు ఎంపికను నిర్వహిస్తామని త్రీమెన్ కమిటీ సభ్యుడు మహతీ శంకర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలను స్థానిక అరండల్‌పేటలోని పిచ్చుకలగుంట క్రీడా మైదానంలో ఏర్పాటు చేసామన్నారు. ఉదయం 8 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు. పాల్గొనే క్రికెటర్లు కావాల్సిన డాక్యుమెంట్లతో రావాలని తెలిపారు. ప్రతి క్రికెటర్ వైట్ డ్రెస్‌తోపాటు సొంత కిట్ తీసుకు రావాలన్నారు.

మిర్చి యార్డు సమాచారం
(మంగళవారం ధరలు)



వచ్చిన బస్తాలు	1,04,743
అమ్మకాలు (గత నిల్వలతో కలిపి)	1,12,001
నిల్వ	37,465

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	రూ. 9,500 - 13,200
నంబరు-5	రూ. 10,000 - 12,500
273	రూ. 10,000 - 12,400
341	రూ. 10,000 - 13,300
4884	రూ. 10,000 - 11,200
తాలుకాయలు	రూ. 4,500 - 6,500

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	రూ. 10,000 - 13,800
షార్క్-1	రూ. 10,000 - 12,000
బాడిగ - 355	రూ. 10,000 - 13,000
దేవనూరు డీలక్స్	రూ. 10,000 - 12,600
ఆర్మూర్	రూ. 9,800 - 11,200
తాలు	రూ. 4,500 - 6,500

-కొరిటిపాడు (గుంటూరు)

ఇక డిజిటల్‌గానే పీఏసీఎస్ కార్యకలాపాలు

శిక్షణలో జిల్లా సహకార అధికారి


మాట్లాడుతున్న జిల్లా సహకార అధికారి వెంకటరమణ

నరసరావుపేట: జిల్లాలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘా(పీఏసీఎస్)లను ఈపీఏసీఎస్‌లుగా మార్చడం జరిగిందని, దీనివల్ల ప్రతి రోజూ అన్ని కార్యకలాపాలు డిజిటల్‌గా చేయడం జరుగుతుందని జిల్లా సహకార అధికారి ఎం.వెంకటరమణ పేర్కొన్నారు. సహకార సంఘాల కంప్యూటీకరణ చేసిన తర్వాత నిర్వహించాల్సిన ఆడిట్‌పై ఏపీ కో ఆపరేటివ్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రకాష్‌నగర్‌లోని కేంద్ర సహకార బ్యాంకు బ్రాంచిలో సహకార శాఖ ఆడిటర్లు, చార్టెట్ అకౌంటెంట్‌లు, సీఇవోలకు శిక్షణ ఇచ్చే కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. పీఏసీఎస్‌ల ఖాతాలు, లావాదేవీల పరిశీలన, భద్రతా ప్రమాణాలు ఆన్‌లైన్ విధానంలో నిర్వహించబడతాయని తద్వారా పారదర్శకత పెరుగుతుందని చెప్పారు. కేంద్రీకృత నిఘా, నియంత్రణ ఉంటుందని, రాష్ట్ర, జాతీయ స్థాయి నుంచి పీఏసీఎస్‌ల పని తీరుపై నేరుగా పర్యవేక్షణ సాధ్యమవుతుందని చెప్పారు. జిల్లా సహకార ఆడిట్ అధికారి డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సంఘ లావాదేవీలు, ఖాతాలు, రికార్డులు స్పష్టంగా ఉండి అవినీతికి అవకాశాలు తగ్గుతాయని, మానవ దోషాలేమీ లేకుండా కంప్యూటరైజ్డ్ విధానంలో త్వరగా ఆడిట్ పూర్తి చేయవచ్చని అన్నారు. గత ఆడిట్లతో పోలికలు వేయడం సులభమని, మానవ వనరులు, పేపర్ వాడకం తగ్గి పర్యావరణ పరిరక్షణకూ తోడ్పడుతుందని చెప్పారు. ఇకపై సంఘాలు సభ్యులకు మెరుగైన సేవలు అందించగలవని, తక్కువ సమయంలో ఖాతాలు చూసే రుణ వివరాలు తెలుసుకునే అవకాశం కలుగుతుందని అన్నారు. ఈ పీఏసీఎస్, ఈ-ఆడిట్ వ్యవస్థలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో కీలకంగా మారతాయని అన్నారు. ఈ ఆడిట్ ఎలా చేయాలో సిబ్బందికి, చార్టర్డ్ అకౌంటెంట్స్‌కు శిక్షణ ఇచ్చి వారి సందేహాలను తీర్చారు. సహకార శాఖ ఆడిటర్‌లు, సీఏలు, సీఇఓలు పాల్గొన్నారు.

మట్టి నమూనా పరీక్ష చేయించుకోవాలి

జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి


చాగంటివారిపాలెంలో అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఐ.మురళి తదితరులు

చాగంటివారిపాలెం(ముప్పాళ్ల): రైతులందరూ తమ పొలాల్లో మట్టి నమూనాలు సేకరణ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి చెప్పారు. మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో మట్టి నమూనాల సేకరణపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి మాట్లాడుతూ మట్టి పరీక్షలు చేయించుకోవడం వలన భూమిలోని పోషక లోపాలను తెలుసుకొని వాటిని నివారించి సాగు చేసినప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయన్నారు. చాలా మంది సాగు సమయంలో జాగ్రత్తలు తీసుకోకపోవడంతో దిగుబడులు కోల్పోవాల్సి వస్తుందన్నారు. ఏటా ఒకే రకమైన పంటలు వేయడం, ఎవరికి తోచినట్లు సాగు చేయడం, ఇష్టానుసారంగా మందులు, ఎరువులు వినియోగించడం తదితర కారణాలతో వ్యవసాయంలో అనుకున్నంతగా ఆదాయాన్ని పొందలేక పోతున్నారన్నారు. రసాయన ఎరువులు అధికంగా వాడటం వలన చీడపీడలు ఎక్కువగా ఆశిస్తాయని, దాని వలన సాగు ఖర్చు పెరుగుతుందన్నారు. అంతే కాకుండా భూసారం తగ్గి దిగుబడులపై ప్రభావం చూపుతాయన్నారు. రైతులు భూసార పరీక్షలపై అవగాహన పెంచుకోవాలన్నారు. మట్టి పరీక్షలు చేయించుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వం సబ్సిడీపై సూక్ష్మపోషకాలు అందించనుందన్నారు. మట్టి నమూనాలకు ఇదే సరైన సమయమని, రైతులందరూ ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని మట్టిపరీక్షలు తప్పక చేయించుకోవాలని సూచించారు. గ్రామంలో నిర్మిస్తున్న నీటికుంటల నిర్మాణాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎమ్.అరుణ, వీఏఏ శైలజ, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జిల్లా కార్యవర్గం ఎన్నిక



సత్తెనపల్లి: రాష్ట్రంలో సాఫ్ట్ టెన్నిస్‌కు ఆదరణ పెరుగుతోందని సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ డి.నవీన్ అన్నారు. అసోసియేషన్ పల్నాడు జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక సత్తెనపల్లిలో మంగళవారం జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. ఈ క్రీడలో ఎక్కువ మంది రాణిస్తున్నారన్నారు. జిల్లా క్రీడా ప్రాధికారక సంస్థ పరిశీలకులుగా జిల్లా క్రీడాభివృద్ధి అధికారి నరసింహారెడ్డి పాల్గొని నూతన కార్యవర్గానికి సూచించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ పి.నవీన్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఎం.నరసింహారావు, ట్రెజరర్‌గా సుజాత ఎన్నికైనట్లు అసోసియేషన్ పరిశీలకుడు గంగాధరరావు తెలిపారు. సమావేశంలో ఎన్నికల అధికారిగా ఐ.ఎస్.నాగిరెడ్డి వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలు కూడా ముఖ్యం అని తెలిపారు. కార్యదర్శి ఎం.నరసింహారావు మాట్లాడుతూ.. భవిష్యత్తులో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించడానికి కృషి చేస్తామని తెలిపారు. సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, సాంబశివరావు, శ్రీరామిరెడ్డి, రియాజ్, శివయ్యలు పాల్గొన్నారు. కొత్త కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

ఈ క్రాప్‌తో సంబంధం లేకుండా కొనుగోలు చేయాలి

జేసీకి వినతిపత్రం సమర్పించిన రైతు సంఘ నాయకులు

నరసరావుపేట: రైతులు పండించిన పంటలను ఈ క్రాప్‌తో సంబంధం లేకుండా అన్ని పంటలను కొనుగోలు చేయాలని రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో వేలాది హెక్టార్లలో రైతులు కంది పంట సాగుచేశారని, తీరా పంట చేతికి వచ్చిన తర్వాత ప్రభుత్వం ఈ క్రాప్ సాగుతో పంట కొనుగోలు చేయకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పండించిన ప్రతి గింజ కొనుగోలు చేస్తామని చెప్పిన్న పాలకులు, ఆ దిశలో నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పండించిన పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయని పక్షంలో రైతుల కుటుంబాలు ఎలా బ్రతకాలని ప్రశ్నించారు. ఇప్పటికైనా రైతులు పండించిన అన్ని పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. రబీ సీజన్‌లో పల్నాడు జిల్లాలో వరి లక్ష మెట్రిక్ టన్నుల దిగుబడి లక్ష్యంగా ఉంటే పదివేల మెట్రిక్ టన్నులు మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేస్తామనటం సరైందికాదని, మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌కు సరిపడా విత్తనాలను, ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచి రైతులను ఆదుకోవాలని కోరారు. లేకుంటే భవిష్యత్తులో రైతులు చేసే ఆందోళనలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

కొనసాగిన కార్మికుల సమ్మె

నరసరావుపేట: తమకు పూర్తిజీతాలు చెల్లించాలని కోరుతూ కొంతమంది మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న నిరసన దీక్షలు మంగళవారం 48వ రోజుకు చేరాయి. యూనియన్ పల్నాడు జిల్లా కార్యదర్శి అమరారపు సాల్మన్ మాట్లాడుతూ శాంతియుత నిరసన ద్వారా తమ సమస్యలు పరిష్కారమయ్యేవరకు పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్మికులు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని రెండు నెలలుగా పురపాలక సంఘం కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్, ఇన్‌చార్జి మంత్రి, ఎమ్మెల్యే జోక్యం చేసుకొని సమస్య పరిష్కరించాలని కోరారు.

నేడు పేరేచర్ల-కొండమోడు రహదారి విస్తరణకు శంకుస్థాపన

సత్తెనపల్లి: తాటికొండ నియోజకవర్గం మేడికొండూరు మండలం పేరేచర్ల-సత్తెనపల్లి నియోజకవర్గం రాజుపాలెం మండలం కొండమోడు నాలుగు లైన్‌ల రహదారి విస్తరణ పనులకు బుధవారం సాయంత్రం 4.00 గంటలకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమానికి రోడ్లు, భవనాలు, మౌలికసదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్థన్‌రెడ్డి హాజరుకానున్నారు. రాజుపాలెం మండలం రెడ్డిగూడెం వద్ద ఏర్పాటుచేసిన నేషనల్ హైవే (ఎన్‌హెచ్ -167 ఏజీ)కి సంబంధించిన నాలుగు లైన్‌ల రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఆయనతోపాటు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ (సత్తెనపల్లి), యరపతినేని శ్రీనివాసరావు(గురజాల), భాష్యం ప్రవీణ్(పెదకూరపాడు), తెనాలి శ్రావణ్ కుమార్(తాటికొండ) పాల్గొననున్నారు.

జూలకల్లు గ్రామంలో కార్డన్ సెర్చ్

కొడవళ్లు, గడ్డపారలు, 30 ద్విచక్ర వాహనాలు స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న కొడవళ్లు, గడ్డపారలు, గొడ్డళ్లు

పిడుగురాళ్లరూరల్: పల్నాడు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని జూలకల్లు గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించామని గురజాల ఇన్‌చార్జి డీఎస్పీ ఎం.హనుమంతరావు చెప్పారు. తెల్లవారుజామున 5 గంటల నుంచి 9 గంటల వరకు జూలకల్లు గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ప్రతి ఇంటిలోనూ సోదాలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని 30 ద్విచక్ర వాహనాలు, 11 కత్తులు, నాలుగు గడ్డపారలు, గొడ్డళ్లు, కొడవళ్లతోపాటు కర్రలను స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ మాట్లాడుతూ జూలకల్లు గ్రామంలో ఫ్యాక్షన్ గొడవలు ఉన్నాయని, ముందస్తు చర్యలలో భాగంగానే ఈ గ్రామంలో ప్రతి ఇంటిలోనూ సోదాలు నిర్వహించామని తెలిపారు. ఇరుపార్టీల వారికి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో పిడుగురాళ్ల సీఐ వెంకట్రావు, దాచేపల్లి సీఐ భాస్కర్‌రావు, గురజాల, సత్తెనపల్లి, గురజాల సబ్ డివిజన్‌పరిధిలోని ఎస్ఐలు వారి సిబ్బంది పాల్గొన్నారు.

క్రిటికల్ కేర్ యూనిట్ కోసం స్థల పరిశీలన

- క్రిటికల్ కేర్ యూనిట్ కోసం జిల్లా పోలీసు విభాగ స్థల పరిశీలన
- త్వరగా విషయం తేల్చాలని కోరిన ఎమ్మెల్యే
- ప్రత్యామ్నాయం చూపించి తీసుకోవాలని జిల్లా ఎస్పీ ప్రతిపాదన

నరసరావుపేట: ఎస్ఎస్పీ కాలనీలోని ప్రభుత్వ వైద్యశాల పక్కనే జిల్లా పోలీసు విభాగం ఆధీనంలో ఉన్న స్థలంలో క్రిటికల్ కేర్ యూనిట్(సీసీయు)ను నిర్మించేందుకు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కె.శ్రీనివాసరావు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మంగళవారం పరిశీలించారు. ఈ స్థలంలో రూ.18కోట్ల వ్యయంతో 75 పడకల సీసీయును నిర్మించేందుకు స్థలాన్ని తమకు అప్పగించాలని వైద్యశాఖ అధికారులు కలెక్టర్, ఎస్పీలను కోరుతూ లేఖ రాశారు. దీనిపై వారందరూ స్థల పరిశీలన చేపట్టారు. ఎమ్మెల్యే చదలవాడ, ఎస్పీ శ్రీనివాసరావుల మధ్య ఆసక్తికర వ్యాఖ్యలు చోటుచేసుకున్నాయి. సార్, స్థలం ఇస్తున్నారో లేదో వెంటనే నిర్ణయించండి, ఇప్పటికే ఆలస్యమైంది, శంకుస్థాపన పెట్టుకోవాలి, నేను మంత్రి(గొట్టిపాటి రవికుమార్) దగ్గరకు వెళుతున్నా అంటూ ఎస్పీని ఉద్దేశించి ఎమ్మెల్యే అన్నారు. దీనిపై ఎస్పీ స్పందిస్తూ మాకు ప్రత్యామ్నాయం చూపించి తీసుకోండని సమాధానం ఇచ్చారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ నేను చూస్తానుగదా అంటూ వారిద్దరి మధ్య మరికొంత మాటలు పెరగకుండా వారించారు. జాయింట్ కలెక్టర్ గనోరే సూరజ్ ధనుంజయ, ఆర్డీవో కె.మధులత, తహసీల్దార్ వేణుగోపాల్, ఎస్ఎస్పీ అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతకు సన్మానం


సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న పెనుగొండ లక్ష్మీనారాయణ

వినుకొండ: కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణను విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో స్థానిక జాషువా కళాప్రాంగణంలో ఘనంగా సన్మానించారు. ముందుగా పెనుగొండను పట్టణ పురవీధుల్లో ఊరేగించి శివయ్య, గంగినేని, జాషువా విగ్రహాలకు నివాళులర్పించారు. అనంతరం కళాప్రాంగణంలో లక్ష్మీనారాయణ దంపతులను ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు సత్కరించారు. కార్యక్రమంలో విద్యావంతుల వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు సీహెచ్ఎల్ఎన్ మూర్తి, సీనియర్ న్యాయవాది పీజే లూకా, అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, సీనియర్ న్యాయవాది చెరుకూరి సత్యనారాయణ, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

అండగా మేమంతా ఉన్నాం

జెడ్పీటీసీ రజనీని పరామర్శించిన బత్తుల బ్రహ్మానంద రెడ్డి


జెడ్పీటీసీ మెంబర్ రజనీ శ్రీనివాసరావును పరామర్శిస్తున్న బత్తుల బ్రహ్మానంద రెడ్డి

కారంచేడు: అనారోగ్యంతో కొంత కాలంగా చికిత్స పొందుతున్న కారంచేడు జెడ్పీటీసీ సభ్యురాలు యార్లగడ్డ రజనీ శ్రీనివాసరావును వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రకాశం జిల్లా వైఎస్సార్ సీపీ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి కలిసి పరామర్శించారు. మంగళవారం మండల కేంద్రమైన కారంచేడు గ్రామంలోని జెడ్పీటీసీ సభ్యురాలి గృహానికి వచ్చిన బత్తుల ఆమెను చూసి చలించిపోయారు. ఎంతో యాక్టివ్‌గా ఉండేవారన్నారు. అనారోగ్యాలను బట్టి కృంగి పోకూడదని, ధైర్యంగా ఉండాలని, మేమంతా మీకు అండగా ఉంటామని ఆమె ధైర్యం చెప్పారు. ఆరోగ్య పరిస్థితులపై ఆయన ఆరా తీశారు. చికిత్స జరుగుతున్న తీరును కూడా ఆయన అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండి అనారోగ్యాన్ని జయించి మరలా మండలంలోని అన్ని గ్రామాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. స్టేట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పి. ఏడుకొండలు, యర్రం లక్ష్మారెడ్డి, గోగినేని బుల్లెబ్బాయి, యార్లగడ్డ శ్రీనివాసరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ట్రావెల్స్ వాహనం బోల్తా

పలువురికి గాయాలు


బాధితుడిని వెలుపలికి తీస్తున్న మిగిలిన ప్రయాణికులు

మార్టూరు: జాతీయ రహదారిపై మంగళవారం టూరిస్ట్ వాహనం బోల్తా పడిన సంఘటనలో పలువురు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. తిరుమల వెంకటేశ్వర స్వామి దర్శనం పూర్తి చేసుకుని విజయవాడ వైపు వెళుతున్న సుమారు 15 మంది ప్రయాణికులతో కూడిన ట్రావెల్స్ వాహనం మంగళవారం ఉదయం చిలకలూరిపేట వైపు వెళుతోంది. రాజుపాలెం కూడలి దాటిన తర్వాత ట్రావెల్స్ వాహనం ముందు వెళ్తున్న మరో వాహనాన్ని వేగంగా ఢీ కొట్టింది. ప్రమాద ధాటికి రహదారికి పడమర వైపు ప్రయాణిస్తున్న ట్రావెల్స్ వాహనం మధ్యలో ఉన్న డివైడర్‌ను దాటుకుంటూ రహదారికి తూర్పు వైపు గల పొలాల్లోకి పల్టీ కొట్టింది. ప్రమాద సమయంలో ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. ప్రమాదంలో డ్రైవర్ పక్క సీటులో కూర్చున్న ఓ వ్యక్తి క్యాబిన్లో ఇరుక్కుపోగా స్వల్పంగా గాయపడిన మిగిలిన ప్రయాణికులు వాహనం క్యాబిన్ డోర్‌ను బలవంతంగా ఓపెన్ చేసి బాధితుడిని తమతో చిలకలూరిపేట ఆసుపత్రికి తరలించుకొనివెళ్లారు.

లోడ్ కిందపడి కార్మికుడు మృతి


వేము ఆదినారాయణ మృతదేహం

చెరుకుపల్లి: ప్రమాదవశాత్తు తాటి మొద్దుల లోడ్ కిందపడి కార్మికుడు మృతి చెందిన సంఘటన మంగళవారం చెరుకుపల్లిలో చోటుచేసుకుంది. మండలంలోని ఆరుంబాక ఎస్సీ కాలనీకి చెందిన వేము ఆదినారాయణ (40) చెరుకుపల్లిలోని ఒక కోత మిషన్‌లో పనిచేస్తున్నాడు. మంగళవారం తాటి మొద్దుల లోడు దింపుతుండగా కింద పడ్డాడు. అతనిపై తాటి మొద్దులు పడ్డాయి. తీవ్ర గాయాలపాలై మృతి చెందాడు. ఆదినారాయణకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు చెరుకుపల్లి ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు.

యువకుడి వేధింపులతో మహిళ ఆత్మహత్యాయత్నం

కొల్లూరు: వ్యక్తిగత ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ చేస్తానని సహజీవనం చేస్తున్న యువకుడు వేధింపులకు పాల్పడటంతో ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహితను భర్త వదిలి వెళ్లిపోయాడు. తన ఇద్దరు పిల్లలను పోషించుకుంటూ కొన్నేళ్లగా ఆమె పుట్టింటి వద్ద ఉంటోంది. అదే గ్రామానికి చెందిన పరిశ గోపీకృష్ణ పరిచయమయ్యాడు. కొన్నాళ్ల తర్వాత సహజీవనం చేస్తున్నారు. ఆమె నుంచి అవసరాల నిమిత్తం అతడు రూ. 1.75 లక్షలు తీసుకున్నాడు. తిరిగి ఇవ్వాలని ఆమె అడగడంతో మాట దాటవేస్తూ వస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం మళ్లీ డబ్బు అవసరం ఉందని అడిగాడు. ఇవ్వడానికి ఆమె నిరాకరించడంతో వ్యక్తిగత వీడియోలు, ఫొటోలు ఆన్‌లైన్‌లో పెడతానని వేధించాడు. దీంతో బాధితురాలు ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఎలుకల మందు పేస్టును కూల్‌డ్రింక్‌లో కలిపి తాగింది. మధ్యాహ్నం కుటుంబసభ్యులు వచ్చాక గమనించి 108 వాహనంలో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ అర్జున్‌రావు తెలిపారు.

తొండపిలో ఘర్షణ

ముప్పాళ్ల: ఇరువురి మధ్య వివాదం ముదిరి జరిగిన ఘర్షణలో ఒకరికి తలకు గాయమైన సంఘటన మండలంలోని తొండపి గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన దుగ్గినేని రామారావు, చల్లా శ్రీనివాసరావుల మధ్య వివాదం జరిగింది. వివాదం ముదిరి రామారావు గడ్డపారతో శ్రీనివాసరావు తలపై కొట్టడంతో తలకు తీవ్రగాయమైంది. గాయపడిన శ్రీనివాసరావుకు సత్తెనపల్లిలో ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరుకు తరలించారు. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వి.సోమేశ్వరరావు తెలిపారు.

శక్తి యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా ఎస్పీ తుషార్ డూడీ

బాపట్లటౌన్: శక్తియాప్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. మహిళల భద్రత కోసం రూపొందించిన శక్తి యాప్ ఆవశ్యకత, వినియోగం దానిలో నిక్షిప్తం చేయబడిన పలు అంశాల గురించి మంగళవారం జిల్లాలోని ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలోని మహిళలకు విస్తృతంగా అవగాహన కల్పించారు. ఎస్పీ తుషార్ డూడీ మాట్లాడుతూ జిల్లాలోని శక్తి బృందాలు జిల్లాలోని కోచింగ్ సెంటర్స్, ఫ్యాక్టరీలు, మాల్స్, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు ఇతర కార్యాలయాలు, జన సమూహం ఉండే ఇతర ప్రదేశాలతోపాటు జిల్లాలోని పలు ముఖ్యమైన ప్రాంతాల్లో మహిళలకు అవవగాహన కల్పించారు. మహిళలకు శక్తి యాప్‌ను ఏ విధంగా వారి మొబైల్ ఫోన్లో డౌన్లోడ్ చేసుకోవాలి, వినియోగించే విధానం, యాప్‌లో పొందుపరచబడి ఉన్న విస్తృతమైన సమాచారం గురించి వివరించినారు. వాటితో పాటు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాల నిషేధ చట్టం, సైబర్ నేరాలు, పోక్సో చట్టం, వివిధ హెల్ప్ లైన్ నెంబర్లు వాటిని వినియోగించుకునే విధానంపై అవగాహన కల్పించారు.

వ్యవసాయ కూలీ కుటుంబాన్ని ఆదుకోవాలి


కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సురేష్

బల్లికురవ: విద్యుత్‌షాక్‌తో చనిపోయిన వ్యవసాయ కూలీ సురభి నాగేశ్వరరావు (46) కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్ కోరారు. సోమవారం విద్యుత్ షాకుతో చనిపోయిన నాగేశ్వరరావు భౌతిక కాయానికి సోమవారం అర్ధరాత్రి నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. రెక్కాడితే కాని డొక్కాడని ఈ కుటుంబానికి విధి విద్యుత్ రూరంలో తీరని అన్యాయం చేసిందని సురేష్ అన్నారు.

నల్లబర్లీ పొగాకు కొనుగోలు చేయాలని వినతి


రైతులతో మాట్లాడుతున్న రాజశేఖర్

పర్చూరు(చినగంజాం): ప్రభుత్వమే నల్లబర్లీ పొగాకు కొనుగోలు చేయాలని పర్చూరు నియోజక వర్గ పరిధిలోని పలువురు రైతులు అధికారులను కోరారు. పర్చూరు శాసన సభ్యుడు ఏలూరి సాంబశివరావు ఆధ్వర్యంలో బుధవారం ఉప్పుటూరు గ్రామంలో పలు విషయాలను ఉన్నతాధికారులకు వివరించారు. అనంతరం ఉన్నత పాఠశాలలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రైతులు, రైతు నాయకులు మాట్లాడారు. వ్యాపారులు కొనుగోలు చేయటానికి ముందుకు రావటం లేదని, విదేశాల్లో ఉన్న ప్రస్తుత అనిశ్చితి పరిస్థితుల్లో పొగాకు ఎగుమతులకు ఆదరణ లేనందున ఈ పరిస్థితి నెలకొందని రైతులు వివరించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని కోరారు. దీనిపై ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి (వ్యవసాయ సహకారం) బుడితి రాజశేఖర్ మాట్లాడుతూ పొగాకు వ్యాపారులతో బుధవారం వెలగపూడి సచివాలయంలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి పొగాకు కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసేలా వారిని ఒప్పిస్తామని తెలియజేశారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన గ్రానైట్ లారీ



విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి ధ్వంసమైన లారీ ముందు భాగం


రెండు ముక్కలైన స్తంభం

బల్లికురవ: గ్రానైట్ లారీ డ్రైవర్ మద్యం మత్తుతో రోడ్డు మార్జిన్‌లోని విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి సుమారు కిలోమీటరు దూరం ఆ స్తంభాన్ని లాక్కెళ్లాడు. ఈ ఘటన మంగళవారం అద్దంకి- బల్లికురవ ఆర్అండ్‌బీ రోడ్డులోని వల్లాపల్లి అంబడిపూడి గ్రామాల మధ్య జరిగింది. అందిన సమాచారం ప్రకారం .. అద్దంకి వైపు నుంచి బల్లికురవ, ఈర్లకొండ క్వారీల నుంచి గ్రానైట్ రాళ్లను ఎగుమతి చేసే ట్రైలర్ లారీ ఓ స్తంభాన్ని ఢీకొట్టింది. బొల్లాపల్లి సబ్‌స్టేషన్ నుంచి పెద అంబడిపూడి, చిన అంబడిపూడి , గుంటుపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా చేసే మెయిన్ లైన్‌లో స్తంభం రెండు ముక్కలైంది. లారీ మీద పడి కిలోమీటరు దూరం వరకు లాక్కెళ్లింది. ఆ సమయంలో 3 ఫేజ్ విద్యుత్ సరఫరా లేకపోవటం వల్ల పెనుప్రమాదం తప్పింది. ఏఈ పి. శ్రీనివాస్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. సిబ్బందితో కలిసి రెండు గంటపాటు శ్రమించి కొత్త స్తంభం ఏర్పాటుతో సరఫరాను పునరుద్ధరించారు. డ్రైవర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఏఈ వివరించారు.